# బస్సు ఆగింది-పోయింది

రామచంద్రరావు బస్సు దిగాడు. అటూ యిటూ దిక్కులు చూస్తూ నిలబడ్డాడు. బస్సు బర్య్యమని మోతచేసుకుంటూ వెళ్ళిపోయింది.

చల్లనిగాలి వీస్తోంది. ప్రకృతి శోభాయమానంగా తలూపింది. రామచంద్రరావుకి అంతా కొత్తగా వుంది.

అలాగే, ఒక్కక్షణం నిలబడి, ఆలోచించుకున్నాడు ఎంతకాలమయింది?ఏడాది....ఇంతలో ఎంతమార్పు! కాలిదారినే బయల్దేరాడు. దారికి రెండుపక్కలా చెట్లూ, పొదలూ ఆలోచించుకుంటూ వెళ్తున్నాడు.

ఆమెను విడిచిపెట్టి యెన్నాళ్ళు వున్నాను!....నన్ను గురించి ఏమనుకుంటుందో....ఇప్పుడు నన్ను చూచి యేమంటుందో!

శరీరం పులకరించింది. పక్కనున్న చెట్లతొర్రలోనుంచి వొక గుడ్లగూబ తుర్రున ఎగిరిపోయింది. చెట్ల సందులనుంచి గాలి రివ్వున వీచింది. చెట్లు తలలూపినయ్!

రామచంద్రరావుకి చలీ, దానితో ఒక విధమైన భయమూ వేసింది. కాలరు పైకితీసి కంఠాన్ని అదుర్దాగా చేత్తో కప్పుకొని, చెట్ల సందుల్లోపడి గబగబా నడచిపోయాడు.

ఆ వూరు రోడ్డుకి దగ్గర దగ్గర మైలుంటుంది. అతను అటూ యిటుగా రెండు ఫర్లాంగు లుంటుందనుకున్నాడు-ఎంత నడిచినా తరగదు.

ఆగలేక కొంచెం దూరం పరుగెత్తాడు.

ఊరు ప్రవేశించాడు- ఒక్క నిట్టూర్పు విడిచాడు. కాని అతనికి

ఉత్సాహంలేదు. ఊరంతా మాటుమణిగివుంది. అతడు అలాగే నడిచాడు. ఒక యింటిదగ్గర ఆగి తలుపుకొట్టాడు.

లోపలనుంచి "ఎవరు?"

"నేనే"

"పేరు చెప్పరాదూ?"

కంఠం గుర్తుపట్టాడు. కష్టం వేసింది. "నా కంఠధ్వని కూడా మరచిపోయారు. నా పాదాల చప్పుడు వినే నన్ను గుర్తించేవారు. ఇప్పుడు...."

ఆమె తలుపుతీసింది.

"ఎవ్వరూ?"

గుర్తుపట్టింది.

"మీరా...." ఇంటిలోకి వెళ్ళింది.

"ఎంత మారిపోయింది? ఎంత అందమొచ్చింది!"

అతడు వెనుకనే వెళ్ళాడు.

పొయ్యిపూది కళ్ళు నలుపుకుంటూ, "ఎవ్వరే అమ్మాయీ!" అని అడిగింది తల్లి.

ఆమె మాట్లాడలేదు.

ఆమె తండ్రి నోటిలోనుంచి చుట్టతీసి ఉమ్మేసి, "ఎప్పుడు వొచ్చారు?" అని ప్రశ్నించాడు.

"ఇప్పుడే వస్తున్నా."

"కూర్చోండి, నిలబడ్డారే!" అన్నది ఆమె తల్లి. రామచంద్రరావు కూర్చున్నాడు. కాని అతనికి భూకంపంమీద కూర్చున్నట్లుగా వుంది. ఆమె "నీవు, నీవు" అనేది ఇప్పుడు "మీరు" అంటున్నది. ఆమె తల్లి "బాబూ, బాబూ" అంటూ తలనిమిరేది. ఇప్పుడు "కూర్చోండి" అంటున్నది; ఆమె తండ్రి "అబ్బాయీ" అనేవాడు. ఇప్పుడు "ఎప్పుడొచ్చారు" అంటున్నాడు. ఇందుకేనా తానంత దూరం నుంచి కాళ్ళుకొట్టుకొంటూ వచ్చింది? ఈ మార్పుకి కారణం?

ఆమె తండ్రి ప్రశ్నించాడు.

"యుద్ధ విశేషా లేమిటి?"

రామచంద్రరావుకి యుద్ధం సంగతి పట్టలేదు. "పీళ్ళలోని మార్పుకి ఏమిటి కారణం?"

ఆమె తల్లి మళ్ళా పొయ్యి పూదుతూ వుంది, పొగనోటిలోకి వెళ్ళి దగ్గింది. తండ్రి చుట్ట తాగుతూ తాగుతూ తుపుక్కున వూశాడు. ఆమె తలెత్తకుండా బొరెటు కుట్టుకుంటూ వుంది. సూది వేలిలో గుచ్చుకుంటే గబుక్కున నోటిలో పెట్టుకుంది. అతడు గద.తా చూశాడు. మహా చిందర వందరగా వుంది. వాళ్ళు ఇదివరకటికంటే ఎక్కువ దారిద్ర్యం అనుభవిస్తున్నారని గ్రహించాడు.

ఆమె అన్నా తమ్ముడూ ప్రవేశించారు. తమ్ముడు గంతులు వేసుకుంటూ తండ్రి దగ్గరకువచ్చి, "సుభాన్ బాబుని వర్కింగ్ కమిటీవారు పిలిచారు" అని చెప్పాడు.

"ఆ నేను చెప్పలా!" అన్నాడు తండ్రి సంతోషంగా.

ఆమె అన్న నడిగింది. "గాంధీ వైస్రాయి సంభాషణలు ఏమైనః?"

అన్న చెప్పాడు_"ఇంకా ఏమీ తెలియలేదు."

తమ్ముడు, "అదికాదే అక్కా! ఒకరినొకరు కౌగలించుకొని కన్నీరు కార్చారట."

ఆమె నవ్వింది.

తల్లి పొయ్యి ఊదటం మానివేసి, "అయ్యో, పాపం నా బిడ్డకెంత కష్టమొచ్చిందే!" అంది.

"నేను చెప్పలా? సమయంవస్తే నాయకులంతా ఒకటౌతారు" అన్నాడు తండ్రి.

తమ్ముడు అన్నాడు, "ఎట్లా అవుతారు? ఏవో కొన్ని హక్కులు తీసుకొని రాజీ చేసుకుందామంటాడు గాంధీ. సంపూర్ణ స్వరాజ్యం ఇస్తేగాని కుదరదంటారు తీవ్రవాదులు."

నాయకులలో సమయానికి ఐకమత్యం కుదరదేమోనని విచారించాడు తండ్రి.

"గాంధీగారు చెప్పినట్లు పోగూడదూ" అంది తల్లి.

"ఎందుకు పోవాలి!" అంది.

రామచంద్రరావు యింటి కప్పువైపు చూస్తూ వింటున్నాడు. అతనిని ఎవరూ గమనించినట్లే లేదు. అతని కంతా గందరగోళంగా వుంది. అతని అవస్థను ఆమె గ్రహించింది, దగ్గరకు వచ్చి-

"భోజనం చేశారా!"

"చేశాను" అబద్ధమాడాడు.

ఆమెకు యింకా మాట్లాడవలసిందేమీ కనబడలేదు. మళ్ళీవెళ్ళి సంభాషణలో పాల్గొన్నది.

ఈసారి రష్యా...

"ఈ యుద్ధం రష్యాకు లాభం"

"దానికేం లాభం? అది తటస్థంగానే వుందిగా?" అన్నాడు తండ్రి.

"కేపిటలిస్టు దేశాలు యుద్ధం చేసుకొని బలహీనత మవటం రష్యాకు లాభంకాదూ?" అన్నాడు తమ్ముడు.

"రష్యా రాజనీతికి జేజేలు" అన్నాడు.

రామచంద్రరావు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. వారి సంభాషణ జవహర్‌లాల్ మీదికి తిరిగింది.

ఆమె అడిగింది-"ఆయన చైనా ఎందుకు వెళ్ళినట్టూ"

"చైనామీద పెద్ద పుస్తకం రాస్తాడు" అన్నాడు తమ్ముడు.

తల్లి అందుకుంది, "పెద్దలను తృణీకరించగూడదు"

"తృణీకారమేముంది! పుస్తకం రాయటం తప్పా!" అన్నాడు తండ్రి.

రామచంద్రరావు ఇక కూర్చోలేకపోయాడు. నెమ్మదిగాలేచి బయటపడ్డాడు. వాళ్ళ సంభాషణలో వాళ్ళున్నారు.

రామచంద్రరావు గబగబా రోడ్డువైపు నడిచాడు బజారులో కుక్కలు బొయ్యిమన్నై. ఒక సోదిచెప్పేది అడ్డువచ్చి తొలిగిపోయింది. అతడు అలాగే పోతున్నాడు—

"ఏమిటిది? నేనంటే యెంత ప్రేమగా వుండేవారు! ఎందుకొచ్చింది మార్పు? ఆమె....ఆమె...." చలికి కాలరు పైకితీసుకుని గబగబా నడిచాడు. "నాకే ప్రపంచమనేది-ఎన్ని కబుర్లు చెప్పుకున్నాం. ఎన్నిచోట్ల తిరిగాం....వాళ్ళ హృదయాలలో ప్రేమలేదు."

ఆలోచించుకుంటూ రోడ్డు దగ్గరకు వచ్చాడు. ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు, నక్కలు కూసినై.

"ప్రేమ....ప్రేమ లేదనటానికి వీలులేదు. గాంధీమీద ఎంత ప్రేమ చూపించారు....సుభాస్‌బాబుని యెంత పొగిడారు....రష్యామీదో....ప్రేమ వుంది....వాళ్ళ హృదయాలు ప్రేమతో తొణికిసలాడుతున్నై....కాని అది దేశంమీదికి మళ్ళింది....అవును."

—తానో....తన సంగతి ఆలోచించుకుంటే తనకే చిరాకు పుట్టింది. తాను వేసుకున్న యిస్త్రీ బట్టలమీద అసహ్యం పుట్టించి నున్నగా దువ్వుకున్న క్రాపుమీద అసహ్యం పుట్టింది.

"ప్రేమ! దేశం!"

బస్సు ఆగింది.

అతడు నిలబడ్డాడు.

కండక్టరు అడిగాడు. "వస్తారా?"

"రాను."

బస్సు వెళ్ళిపోయింది.

అతడు కూర్చున్నాడు. అలాగే కూర్చున్నాడు. ఆ చెట్టు క్రిందే!